
# వెలుగు ఎక్కడ సోనియా

డా॥ వి. చంద్రశేఖర రావు



విశాలమైన అపార్టుమెంటు. అటు ఇటు హడావుడిగా నడుస్తూ మనుషులు. మూడవ అంతస్థులో అపార్టుమెంటు ముందు నిలబడి నేను. సగం తెరిచిన తలుపు. "మోహన సుందరం ఏమైనాడు?" పెద్దగా అరుస్తున్నాను. ఎటువైపు నుంచీ సమాధానం లేదు. కారిడార్‌లో నడుస్తున్న మనుషులు క్షణంసేపు ఆగి నిర్లిప్తంగా చూసి వెళుతున్నారు. "వారం రోజులుగా ఈ తలుపు ఇట్లాగే తెరిచి వుంది! లోపల లైట్లు కూడా ఆర్పి వెళ్ళలేదు. ఇంత హఠాత్తుగా ఎట్లా మాయమైనాడు?" పెద్దగా అరుస్తున్నానేగాని నా గొంతు నాకే వినబడనట్లుగా పీలగా, చీమగొంతులా వుంది. తెరిచిన తలుపులోంచి లోపలికి చూశాను. గోడకు తగిలించిన ఖద్దరు లాల్చీ, పైజమా, గాంధీ టోపీ. టేబుల్‌పై సగం తెరిచిన డైరీ. రెపరెపలాడుతున్న డైరీపై ఎర్రమరకల కత్తి! లోపల నుండి దుర్గంధం. శవం కుళ్ళుతున్న వాసన. వాసన గదిలోనో, నా శరీరంలోనో తెలియనట్లుగా వుంది. కారిడార్‌లో కలకలం. హడావుడిగా పరిగెత్తుతున్న జనం. "మోహనసుందరాన్ని చంపండి!" ఎక్కడి నుండో పెద్దగా కేకలు. కేకలు క్రమంగా పెద్దవౌతున్నాయి. భయంతో పారిపోతూ నేను.

దూరంగా సోనీ. దేవతలా మెరిసిపోతుంది. తన దోసిళ్ళ నిండా వెలుగు. వెలుతురంతా దోసిలిలోకి తీసుకొని ఎక్కడికో ఎగిరిపోతుంది సోనీ. "వెలుగు ఎక్కడ సోనియా?" చీకటిలో ఒక్కణ్ణే అరుస్తూ వున్నాను.

ఉలిక్కిపడి నిద్రలేచాను. ఒంటరి అపార్టుమెంటు. బయట చప్పుడేమీ లేదు. ఒక నిట్టూర్పు. "అసలిట్లా జరగకుండా వుండాల్సింది!" నాలో నేను గొణుక్కున్నాను. అంతట్నీ పక్కనబెట్టి కొత్తగా జీవించాలనే కోరిక.

xxx

"నాకిదంతా విసుగు! పాలిటిక్స్ అంటే రోత!! మా నాన్న కార్పోరేటర్‌గా వెలగబెట్టిన జీవితమంతా నాకు తెలుసు. తాగుడు, రౌడీల్ని పెంచటము, ఊరంతా ముండలు, ఐ హేట్ యిట్! ఈ జెండాలన్నా, ఖద్దరన్నా నాకు వెగటు! నేను, మా అమ్మ ఎంతో హింసను అనుభవించాము. ఇవాల్టికీ ఇద్దరు రౌడీలు పక్కన లేందే బజారున పడలేము. ఏం బ్రతుకు? 'మేం బి.సి.లం. మనవాళ్ళలో, మన జిల్లాలోనే ఇంత ఖరీదైన బంగళా ఎవరికుంది?' అంటాడు మా నాన్న! "ఏం గొప్ప? పలుగురుతో సమంగా లేని సుఖం, సంపద ఎందుకోసం?"

"ఈ కాలేజీలోనూ ఇట్లాంటి తంతు చూసి బెదిరిపోయాను. వచ్చిన రెండో వారంలోనే 'మన కులం మీటింగు రేపాదివారం. తప్పక రావాలి!' అంటూ మెసేజ్! 'ఆడు మనోడు కాదు! వాడితో మాట్లాడకు!'; అని బెదిరింపు! ప్రాణం ఉసూరంది. కాలేజీలోనూ సుఖం లేదే అని దిగులుపడ్డాను."

"నిమ్మల్ని చూసి నాకే కొంచెం ఊపిరొచ్చింది. బుద్ధిమంతుడైన బాలుడిలా, నున్నగా దువ్విన జుట్టు, లూజు, లూజు ఫాంటు, షర్టు, కళ్ళజోడు. తెరిచిన పుస్తకంలా ఎప్పుడూ లైబ్రరీలో వుండటం, నిమ్మల్ని చూస్తే బోలెడంత ఆనందం వేసింది. కులాల గురించి, కొట్లాటల గురించీ కాక కాస్త సబ్జెక్టు గురించి మాట్లాడే మనిషి దొరికాడే అనిపించింది!"

సోనీ! సోనీ! ముఖం చూసి మోసపోకు! నా ముఖం పైని చర్మాన్ని చీల్చితే లోపలో ఉన్మాది! పోలీసు ఫైళ్ళలో, దొమ్మీ కేసుల్లో ముద్దాయిగా నా పేరు. 'వీడిక్కడుంటే మనకు దక్కడు! దూరంగా ఏ కాలేజీలోనన్నా వేద్దాము!' అంటూ నాయన తరిమితే, ఇటు వచ్చి గతాన్ని దాచి, కొత్త జీవితాన్ని నటిస్తూ, సోనీ! ఎట్లా నన్ను నమ్మావు?

సోనీతో కలిసి ఒకసారి స్పార్టకస్ సినిమాకు వెళ్ళాను. ఆ సినిమాలో చివరి దృశ్యం. వేలాది కాగడాలతో వెలుగు సముద్రంలా బానిసలందరూ కదలి వచ్చే దృశ్యం. ఒళ్ళు గగుర్పాటు కలిగించే దృశ్యం. "మన ఆత్మల దుఃఖం. మన క్రోధం, మన నిస్సహాయతలోంచి ఒక తిరుగుబాటు మొలకెత్తాలి! ఈ తిరుగుబాటు ఒక అగ్ని. ఒక నిరంతర వాంఛ. స్పార్టకస్‌లాగా మన జీవితాల్ని మలుచుకోగలిగితేనా?" సోనీలో వింత సంచలనం. రాజకీయాలు మాట్లాడటం విసుగు అనే అమ్మాయి, తిరుగుబాటు గురించి, స్వేచ్ఛ గురించి మాట్లాడటం, సరికొత్త అనుభవం నాకు.

సోనీ మిగిలిన అమ్మాయిల్లాంటిది కాదని నెల రోజులకే అర్థమైంది. స్వీట్ నథింగ్స్, సొల్లు కబుర్లు, పబ్‌లు, పార్టీల తరహా స్నేహం కాదు తనది. సోనీతో మాట్లాడుతుంటే పాతగాయాన్ని కెలుకుతున్నట్లుగా వుండేది. దళిత సమస్య, స్త్రీ విముక్తి లాంటి గంభీరమైన విషయాలు మా మధ్యకు చర్చకు వచ్చేవి. సోనీతో గడిపినంతసేపూ గొప్ప స్వప్నాన్ని దర్శించినట్లుగా వుండేది.

ఆ సంవత్సరం చివర్లో "మనం పెళ్ళి చేసుకుందాం మోహన్!" అంటూ సోనీ ప్రపోజ్ చేసింది. "మేం ఎస్.సి.లం. మన పెళ్ళి అంత సులువుగా జరుగుతుందా?" అన్నాను, నానైన భయాలతో. సోనీ చాలా తేలిగ్గా తీసుకొంది. "ఎస్.సి.లు, బి.సి.లు కలిసి రాజ్యం చెయ్యగా లేనిది, మనం కాపురం చెయ్యలేమా?" అంటూ కొట్టివేసింది.

పది మంది స్నేహితులు, రిజిస్టరాఫీసు, పేపర్‌లో ఫోటో ప్రకటన - ఇద్దరం దంపతులమయ్యాం! ఊహించిన తుఫాను ఏదీ రేగనే లేదు. సోనీ తల్లిదండ్రులు మౌనం వహించారు.

కొత్త కాపురం. ఇరుకైన గది. ఒకే ఒక మంచం, దమదమలాడే టేబుల్ ఫాను. అయినా అలసిపోని నిరంతర శరీరభాష కమ్మని పాటై మోగింది మా మధ్యన. సరిగ్గా రెండు వారాలు గడిచాయి.

ఇంటి ముందు రెండు కార్లు ప్రత్యక్షమయ్యాయి ఒక ఉదయాన. సోనీ తల్లిదండ్రులు, అన్నయ్యలు దిగారు. నింద వేయటాలు, దుఃఖపడటాలు అయిపోయినాక "అయిపోయిందేదో అయిపోయింది. ఇక ఇంటికి పోదాం పద! రిసెప్షన్ అన్నా పెట్టుకుందాం!" అన్నారు.

ఇల్లనే పెద్ద బంగళా. బంగళాపై పార్టీ జెండా. ఎందుకో ఆ జెండాని చూడగానే గుండె ఉలిక్కిపడింది. ఒక అశుభానికి, విధ్వంసానికి ప్రతీకలా తోచింది ఆ జెండా. ఇంట్లో అడుగుపెట్టిన పది నిముషాలకు పోలీసు వ్యాను. రెండు వారాల చిత్రహింస జైలులో. అంతా రహస్యంగా జరిగిపోయింది. శరీరంలోంచి రక్తాన్ని తోడేసినట్లుగా, ఎముకలన్నిటినీ క్రష్ చేసినట్లుగా అయ్యింది నా పరిస్థితి. ఆ రెండు వారాల తరువాత బ్రతికి వుండటమే గొప్ప! సోనీని ఆ తరువాత నాలుగేళ్ళు నేను చూడలేదు. ఆమెను హౌస్ అరెస్ట్‌లో వుంచి ప్రైవేటుగా చదివించారని తెలిసింది.

xxx

తొంభైల తరువాత డిగ్రీలకు ఉద్యోగాలు లేవనే విషయం డిగ్రీ తీసుకుని బయటకు వచ్చిన ఆరు నెలలకే అర్థమైంది. పి.జి.లకే దిక్కు లేదు. వంశపారంపర్యమైన వృత్తివైనా నేర్చుకోలేదే అనే దిగులు. పేపరు ముక్కకు, సిగిరెట్టు పీకకు అమ్మనైపు చెయ్యి చాచాల్సిన పరిస్థితి. మాసిన గడ్డం, గళ్ళలుంగీ, పొట్టి చొక్కా, పల్లె గుండెలపై మొలుచుకొచ్చిన పిచ్చికంపలా జీవిస్తున్న రోజులు.

పెద్ద మామది గిత్తల వ్యాపారం. సంకలో ఏ నా కొడుకు అడ్డ వస్తాడో చూద్దాం!" అంటూ ముందుకు తోసాడు. వద్దు వద్దు అనుకుంటూనే వీధిలోకి నడిచాను. మామ ఊహించిందే నిజం! ఈ సానెవడూ సోలెత్తలేదు. జెండా రెపరెపలాడింది. బేసరు వీధి కడ్డంగా ఊగులాడుతుంది. నా లోపల ఏదో భయం. జెండాలో ఒక రంగైన ఎరుపు నా వైపు క్రోధారుణ నేత్రాలతో చూస్తున్నట్లుగా వుంది. ఈ జెండా వదుల్చుకోలేని శాపమేమో అనిపించింది.

జన సమీకరణ చూసి ఎమ్మెల్యే రెచ్చిపొయ్యాడు. వందకు పైగా దండలు. బుట్టలు బుట్టలుగా కురిసిన పూలు. మామకీసారి సమితి ప్రెసిడెంటు సీటు ఖాయం అన్నారందరూ. ఎమ్మెల్యే వెళ్ళిన పది నిముషాలకు మామ వుంటున్న వీధిలో బాంబు పేలింది. చీకట్లో గుర్తు తెలియని మనుషులు చుట్టుముట్టారు. ముందు కర్రలతో దాడి చేశారు. వెళుతూ వెళుతూ బాంబు విసిరి వెళ్ళిపోయారు. చీకట్లో యుద్ధాలు అట్టేసేపు వుండవు. నిముషాలే. వెలుతుర్లో చూసుకుంటే మామ కుడిచెయ్యి తెగి రోడ్డుపై పొర్లుతుంది. శరీరమంతా రక్తం. మనిషి బ్రతుకుతాడో లేదో తెలియదు. పెద్దాసుపత్రిలో చేర్పించిన పది గంటలకు మామ ప్రాణాలు పొయ్యాయి.

మళ్ళీ ఊళ్ళో కొచ్చాడు ఎమ్మెల్యే. వెంట పోలీసులూ వచ్చారు. పది మందిని అరెస్టు చేశారు. వీళ్ళకు ఉరి ఖాయం అంటూ శపథం చేసేడు ఎమ్మెల్యే. ఇంట్లో పేరు పేరునా అందర్నీ ఓదార్చాడు. నా భుజం తట్టి, విజిటింగ్ కార్డు ఇచ్చి ఎగ్జిక్యూటివ్ బ్యాగు. చేతిలో రకరకాల దరఖాస్తులు. ఇళ్ళ స్థలాలు, డి.ఆర్.డి.ఎ. పథకాలకు అప్లికేషన్లు, పింఛను ఫారాలు, ఎమ్మెల్యేల సంతకాలున్న ఖాళీ లెటర్ హెడ్‌లు మినీ రాజకీయ క్రిమి ఆయన. "ఎమ్మెల్యే మన ఊరు వస్తున్నాడు. బ్యానర్లు కట్టడం, జెండాలు ఎగరవేయడం, జనాన్ని మీటింగులకు తోలటం, అంతా కలిపి పూట పని. ఐదొందలిస్తాను" అంటూ కబురు చేశాడు. ఈ జెండా చూస్తే నాలో ఎందుకో వింతయిన భయం. అదో అశుభమైన ప్రతీకలా తోస్తుంది. కానీ అయిదు పెద్ద కాగితాల్ని తలచుకొని నీరు ఊరింది.

మొదటి బ్యానరు కట్టే దగ్గరే గొడవైంది. ఆ వీధంతా అపోజిషన్ పార్టీవాళ్ళే. బేనరు కట్టడానికి వీల్లేదని, "గుడ్డ కనిపించిందంటే, వుచ్చి లేచిపోతుందిని..." బెదిరించారు. గొడవెందుకని వెనుదిరిగాము. "ఇంత పిరికినాయాలివా?" అంటూ పెదమామ విసుక్కున్నాడు. బొడ్లోంచి కత్తి తీసి పంత సులువుగా పెరట్లోంచి నలుగురు సిటీ రౌడీల్ని బయటికి తీశాడు. ఎర్రటి కళ్ళు. గుప్పున మందు వాసన. చేతిలో బాణాకర్ర. నిగనిగలాడే ఇనుపశిలల్లా వున్నారు. "వీళ్ళను వెంట తీసుకుపో! టౌన్‌కొచ్చినప్పుడు తప్పక కలవమని చెప్పి వెళ్ళాడు.

ఆరు నెలల తరువాత మామ కేసు హియరింగుకు వచ్చింది. సాక్షులు కావాలంటూ పది మంది కుర్రవాళ్ళను పిలిచారు. నేను మొండికేశాను. "ఐదొందలు. లాడ్జీ, భోజనం ఫ్రీ!" అనేసరికి మనసు గిలగిలలాడింది. వాళ్ళతోపాటు జీపు ఎక్కాను. రాత్రికి పార్టీ ఆఫీసులో వుంచారు. లాయరు డైలాగులు రాసిచ్చాడు. రెండుమూడు రిహార్సులు చేయించాడు. రాత్రికి బిరియానీ, చికెన్ ఫ్రై, చేపల పులుసు వచ్చాయి. విస్కీ బాటిళ్ళు రెండు ఇచ్చి వెళ్ళాడు. మరో గంట అయినాక ఇద్దరు ఆడవాళ్ళు లోపలికి వచ్చారు. బిగుతుబిగుతు బట్టలు, క్రీములు, పౌడర్లు అద్దిన ముఖం. చవకబారు సెంటు, పెదాలపై కిళ్ళీలు - సిగ్గుపడ్డ నలుగురైదుగురు కుర్రవాళ్ళం బయట వరండాలో బల్లలపై పడుకున్నాము.

తెలతెలవారుతుండగా పార్టీ ఆఫీసులో పెద్ద కలకలం. రౌడీల్ని దించారు! పారిపొండి! అంటూ కేకలు. వాళ్ళ టార్గెట్టు మా పైనే. తళతళలాడే కత్తులు. నిర్దయగా వున్న ముఖాలు. భయం వేసింది. పదునైన కత్తి జబ్బలోకి సర్రున దిగింది. రక్తం! గదుల్లోని కుర్రాళ్ళు విస్కీ మత్తు ఇంకా దిగని కళ్ళతో పొగరుగా అరుస్తూ వచ్చారు. వాళ్ళ ముఖాల్లో తెగింపు! అరుపులు, కేకలు! ఇరవై మంది కూడా లేని ఆ దొమ్మీకి యుద్ధ వాతావరణం వచ్చింది. భయం భయంగా వున్న నాలో ఒక తెగింపు తలుపు తెరుచుకొంది. నేలపై జారిన కత్తిని చేతిలోకి తీసుకున్నాను. క్షణం సేపు వణుకు. ఆ తరువాత వింత ధైర్యం. ఒక విద్యుత్తు ఏదో లోపలికి పాకినట్లుగా వుంది. అరంగుళాల కత్తిలో ఇంత మహిమా అనిపించింది. ఒక నిషాలాంటి భావన. ఎదురొచ్చిన వాడి పొత్తికడుపులో కత్తి సర్రున దిగి, రక్తం చిమ్మి, వాడు 'అమ్మా' అని కూలబడ్డ తరువాతగానీ ఆ నిషా దిగలేదు. కృత్రిమమైన ధైర్యపు పొర చిరిగి, నగ్నంగా, భయంగా హిస్టీరికల్‌గా అయిపొయ్యాను. పారిపోవాలనే కాంక్ష. ఎటైనా మానవ సమూహాల నుండి, మనిషి పోలికలు కనపడని అజ్ఞాత ప్రదేశంలోకి పారిపోవాలని కోరిక.

జిల్లా యువసేన నాయకుడి దగ్గరకు తీసుకెళ్ళారు. మాలో ఆరుగురు కుర్రవాళ్ళని అజ్ఞాతంలోకి వెళ్ళిపొమ్మని ఆదేశించారు. అజ్ఞాత ప్రదేశం ఒక లాడ్జి. శిథిలమైన మారుమూల లాడ్జి. భోజనం, పేకాట. రాత్రిపూట విస్కీ, సరఫరా. మునుపటిలా సంకోచం లేదు. విస్కీ నాలుకపై పడగానే వింత మనిషి నాలోంచి అవతరించాడు. సున్నితమైన అనుభూతులు లేని మొరటు మనిషి. శరీరం లోపల క్రూరజంతువొకటి ఆవులిస్తూ తిరుగుతున్నట్టుగా వుంది. రాత్రి వచ్చిన కంపెనీ ఆడపిల్లల్ని చూస్తే జాలి కలుగలేదు. వింత కసి, కోరిక. ఆ స్త్రీలతో గడిపిన తరువాత మానవుడి నుండి భగవంతుడు దాచిన ఆనంద రహస్యాన్ని తిరిగి పొందినట్లుగా అనిపించింది. "సోనీ ఎవరు? ఏ కంపెనీ పిల్ల?" అమాయకంగా అడిగిందా పిల్ల, నా కలవరింతల్ని చూసి. ఈడ్చి కొట్టాను. రక్తం. పన్ను కూడా ఊడిందేమో? ఇంకా "లంజా!" అంటూ అవమానకరమైన క్రూరమైన తిట్టు కూడా తిట్టాను. ఆ సంఘటన, ఆ తిట్టు తరువాత నా లోపల ఎక్కడో సన్నగా వెలుగుతున్న చివరి దీపం కూడా ఆరిపోయినట్లుగా అనిపించింది.

కొత్త మానవుడిగా అవతరించాను.

"ఏ పనైనా మోహన సుందరమే చెయ్యాలి!" అని పొగిడించుకున్నాను. మీటింగులకు జనాన్ని తీసుకురావటం, పోస్టర్ల ప్రచారం వగైరా. జీపులు, కార్లు రెడీ చెయ్యటం, డిన్నర్లు, మందు పార్టీలు ఎరేంజ్ చెయ్యటం. అన్నీ చిటికవేసినంత సులువుగా, త్వరగా జరిగిపొయ్యేవి! 'మోహనసుందరం మీటింగుల స్పెషలిస్టు' అని పేరు తెచ్చుకున్నాను. కొత్తలో ఇదంతా విసుగ్గా వుండేది. ఒక ఆదర్శం, ఆశయం లేదు. అంతా రొడ్డ కొట్టుడు. ఒక్కోసారి దుఃఖం వేసేది. తరచు నా దగ్గరకు వచ్చే కంపెనీ ఆడపిల్లలకు, నాకూ తేడా లేదేమో అనిపించేది. ఆ పిల్లల్లాగే ఇదీ ఒక బ్రతుకుతెరువు అనుకొని సరిపుచ్చుకొనేవాణ్ణి. కొత్తలో డబ్బుకు కిటకిటలాడేది. లీడర్లను అడిగితే వాళ్ళు నా వైపు పిచ్చివాడిలా చూసేవాళ్ళు. నరసింహారావు అనే కార్పోరేటరు కిటుకు చెప్పేడు. కాంట్రాక్టర్లు, బిజినెస్ మాగ్నెట్లు - ఏదో పేరు చెప్పి దండుకోవటం. ఎవడూ ప్రొటెస్టు చెయ్యకపోవటం ఆశ్చర్యం అనిపించేది.

ఒకసారి రైల్వే వాళ్ళ వేలం పాటకు వెళ్ళేము. కోటి రూపాయిల వ్యాపారం అది. వచ్చిన వాళ్ళు ఇరవై మంది. వాళ్ళకో కోటి రూపాయిల లాభం వుంటుంది. అందర్నీ పిలిచి 'స్పెషల్ పార్టీ ఫండు'కు లాభంలో ఐదు శాతం ఇవ్వండి' అంటూ డిమాండ్ చేశాము. 'ఇట్లా ఎప్పుడూ లేదు!' అని గొడవ చేశారు. "ఎలక్షన్ ఫండు ఇస్తున్నాం కదా!" అని గింజుకున్నారు. మధ్యాహ్నం దాకా డ్రాగ్ చేశారు. రెండింటికి నాటు రౌడీల్ని రంగంలోకి దించారు. ఒళ్ళు మండిపోయింది. వచ్చిన వాళ్ళను చితకతన్నాము. ఒకడిపై యాసిడ్ చల్లాము. రెండు మారుతీ కారుల్ని తగలబెట్టాము. వేలం పాట ఆపివేశారు.

మరుసటి రోజు పేపర్లో మొదటి పేజీలో వచ్చింది సంగతి, ఫోటోలతో సహా! మధ్యాహ్నానికి ఎమ్మెల్యే ప్రకాశరావు దగ్గర నుండి ఫోను. "మరీ అంత ఫాస్ట్‌గా పోవద్దు! పార్టీ ఇమేజి ముఖ్యం! అసలు నువ్వు గుంటూరు వదిలి రా! నా దగ్గరే వుందువుగాని" అని.

ఇదో కొత్త జీవితం. ఐ.ఎ.ఎస్. ఆఫీసర్లు కూడా విష్ చెయ్యటం. గొప్ప థ్రిల్‌గా వుండేది. ప్రకాశరావు నడిగి ఆ పని చేసిపెట్టు, ఈ పని చేసిపెట్టు అని జనం నా చుట్టూ తిరుగుతుంటే - మొదటిసారి ఈ అధికారంలో వుండే రుచి ఏమిటో అర్థమైంది. చాలా రోజుల తరువాత నాలో ఒక ఆశయం రూపుదిద్దుకుంది. ఎప్పటికైనా ఈ అధికారపు బంగారు చిలుకను పట్టుకొని నా యింట్లో దాచుకోవాలని.

మనిషి బ్రతకడానికేం కావాలి? తిండి, బట్ట చాలవా! అనే మాట వెగటుగా అనిపించేది. ఆ కబుర్లు చెప్పేవాళ్ళకు తెలియని సుఖం - వందలాదిగా మన చుట్టూ మూగి 'మహాప్రభూ!' అని మొకరిల్లుతూ వుంటే - హఠాత్తుగా మన భుజాలకు రెక్కలు మొలిచి, నెత్తికి కొమ్ములు వచ్చి - 'లోకాతీత మానవుణ్ణి' అనే ఫీలింగ్ కలిగి - 'దీని కోసం త్యాగాలైనా చెయ్యవచ్చు అనిపించింది.

ఎమ్మెల్యే దగ్గర పనులు చేయించుకొన్నవాళ్ళు నా చేతిలో పెట్టే కవర్లు అన్నీ కలిపితే నా ఆదాయం ఇరవై వేలకు పైనే. ఖరీదైన ఫారిన్ విస్కీ ఎప్పుడూ అందుబాటులో వుండేది. స్త్రీ సుఖం కూడా అందుబాటులో వుంటే ఎంత బాగుండు అనిపించింది. కంపెనీ ఆడవాళ్ళ సుఖం ముఖం మొత్తింది. ఆ రోజుల్లోనే పార్వతి అనే కాలేజీ లెక్చరర్‌తో పరిచయమైంది. మొగుడు, రెండేళ్ళ బిడ్డ హైదరాబాదులో. రెండు వందల మైళ్ళ అవతల ఉద్యోగం. ట్రాన్స్‌ఫర్ చేయించమని అడిగింది. నేను చొరవ తీసుకొన్నానా? బలవంతపెట్టానా? నా కిప్పుడు స్పష్టంగా గుర్తు లేదు. వారం వారం పార్వతిని రహస్యంగా కలుసుకోవటం ఒక తప్పనిసరి అవసరమైంది. పార్వతి కళ్ళలో ఇష్టం, అయిష్టం కనపడేవి కావు. కానీ ఎంతగానో సహకరించేది. కమ్మని ఇంటి భోజనం తిన్నట్లుగా వుండేది ఆమె స్నేహం. నా కొచ్చే డబ్బులో చాలా భాగం పార్వతి కోసం ఖర్చు పెట్టేవాణ్ణి. చీరలని, గిఫ్టులని. ఒక కుటుంబ స్త్రీపై ఇట్లాంటి రహస్య అధికారాన్ని పొందటంలో - ఎందుకంత తృప్తి వుందో నా కర్థం కాలేదు. ఆవిడ వైపు నుండి ఈ వ్యవహారాన్ని చూడడానికి ఎప్పుడూ ప్రయత్నించలేదు నేను. నా రాజకీయ జీవితానికి సమాంతరంగా ఈ సంబంధం కూడా పెరిగింది. అయితే ఈ వ్యవహారానికి చివరి ఘట్టం పార్వతే రాసింది. ఉద్యోగానికి రాజీనామా చేసి, భర్తతో సహా హైదరాబాదు నుండి అదృశ్యమైపోయింది. నాలో వింత కసి. కొంచెం భయం కూడా వేసింది. ఆవిడ జీవితానికో రొమాంటిక్ హీరోననుకున్న నన్ను ఒట్టి విలన్ వెధవ్వి అని ముఖం మీద ఊసినట్లుగా చేసిందే ఈ పార్వతి అని కలవరపడ్డాను.


ఈ ఆత్మగ్లాని ఎక్కువ కాలం నిలబడలేదు. గుంటూరు కార్పోరేషన్ ఎన్నికల్లో కార్పోరేటర్‌గా నన్ను నిలబెడుతున్నామని ప్రకాశరావు అనడంతో మళ్ళీ అధికారపు బంగారు చిలుక కలలన్నీ నా చుట్టూ మూగాయి.

ఈ ఎలక్షన్లలో గెలవటం తప్పనిసరి అవసరం నాకు. మరిచిపోయిన కాలేజీ డిగ్రీలు అవసరమయ్యాయి. కులం అవసరమైంది. నా చిన్ననాటి ఉపాధ్యాయులు, క్లాస్‌మేట్లు అందరూ అవసరం వచ్చారు. ఒక ఆదర్శ పురుషుడిననే మేకప్ అవసరమైంది. పత్రికల్లో వ్యాసాలు అవసరమైనాయి. కాలేజీ రోజునాటి, పోరాట గాథల్ని వెలికితీసి నగిషీలు చెక్కి, అందమైన కథలుగా ప్రచారం చేయించాల్సి వచ్చింది. నాకు ప్రచారం చెయ్యడానికి ప్రకాశరావు స్వయంగా వచ్చాడు. 'రాజకీయాల్లోకి యువకులు, విద్యార్థులు రావాల్సిన తరుణం వచ్చిందని - అందుకనే మోహనసుందరానికి ఛాన్స్ యిచ్చామని చెప్పాడు. రాత్రి బంగళాకు కులం పెద్దల్ని పిలిచి "మీ

మిగతా 13వ పేజీలో



# మనసు వైద్యం




★ మా బాస్ నన్ను వలలో వేసుకున్నాడు. నాకు ఒక బాబు పుట్టాడు. అవసరం తీరాక నన్ను చులకనగా చూస్తున్నాడు. నేనిప్పుడు ఎలా బతకాలి?

★ హిప్నో థెరపీ ద్వారా నత్తి నయం అవుతుందా?

? నా వ్యక్తిత్వం అంటే నాకే ఇష్టం లేదు. ఎందుకిలా వున్నానా అని బాధపడని రోజు లేదు. సంఘంలో సమగ్రమైన వ్యక్తిత్వంతో ముందుకు వెళ్లాలని చాలా వుంది. కానీ, నేనే ఇష్టపడని నా వ్యక్తిత్వాన్ని ఇతరులు ఎలా ఇష్టపడతారు? సమగ్రమైన వ్యక్తిత్వం వుండాలంటే ఏం చేయాలి?

-ఎమ్.వాసుదేవరావు (హైదరాబాద్)

! వ్యక్తిత్వం అనేది కొనుక్కునే వస్తువు కాదు. తల్లిదండ్రుల పెంపకం, ఇంటి దగ్గర పరిసర వాతావరణం, స్కూలు వాతావరణం - వీటన్నిటిపైనా మీ వ్యక్తిత్వం ఆధారపడుతుంది. ప్రతి విషయాన్ని సూక్ష్మంగా పరిశీలించే గుణం ఏర్పరుచుకుంటే, ముందుగా మీ వ్యక్తిత్వాన్ని మీరు ఇష్టపడటం ప్రారంభిస్తారు. అనవసరంగా, అతిగా మాట్లాడే గుణం పూర్తిగా తగ్గించుకోవాలి. ఏదైనా ఒక సమస్యను పరిష్కరించడానికి కేవలం మీ స్వార్థంతో ఆలోచించకుండా, ఇతరుల వైపు నుంచి కూడా ఆలోచించగలిగితే మీ వ్యక్తిత్వం పెరుగుతుంది. ఏ సమస్యనైనా మంచిగా పరిష్కరించే శక్తిని పెంచుకోవాలి. పైన చెప్పిన విధంగా మీరు మిమ్మల్ని అభివృద్ధి చేసుకుంటే, జీవితంలో మీరు మీ వ్యక్తిత్వాన్ని గౌరవించగలుగుతారు. ఇతరులు గౌరవించేలా చేసుకోగలుగుతారు.

? నా వయస్సు 20 సంవత్సరాలు. నాకు 8 సంవత్సరాల నుంచి నత్తి వచ్చింది. మా ఇంట్లో ఇంకెవరికీ నత్తి లేదు. ఈ సమస్య వల్ల నన్నెవరూ పెళ్లి చేసుకోవడానికి ముందుకు రావడంలేదు. నత్తి తగ్గించడానికి హిప్నోథెరపీ వుపయోగపడుతుందా?

-బి.వి.రాణి (విజయవాడ)

! "నత్తి" రెండు రకాలుగా రావడానికి అవకాశం వుంది. మొదటిది శారీరకంగా వచ్చే నత్తి అయితే, రెండవది మానసికంగా వచ్చే నత్తి. శారీరకంగా వచ్చే నత్తి హిప్నాటిజం ద్వారా తగ్గించడం వీలు కాదు. అదే మానసిక నత్తిని హిప్నో థెరపీ ద్వారా తగ్గించడానికి ప్రయత్నం చేయవచ్చు. ఇక మీ విషయంలో మీది మానసిక నత్తి అనే నేను అనుకుంటున్నాను. ఎందుకంటే మీకు పుట్టినప్పటి నుంచీ నత్తిలేదు. మధ్యలో వచ్చింది. చిన్నపిల్లలు ఎక్కువగా భయపడడం వల్ల, తల్లిదండ్రులు ఎప్పుడూ కొట్లాడుకుంటూ పిల్లల్ని ఎక్కువగా విమర్శించడం వల్ల, అభద్రతా భావం వల్ల సినిమా నటీనటులను అనుకరించడం వల్ల, మానసిక నత్తికి లోనుకావడం వల్ల మానసిక నత్తి రావడానికి చాలా ఆస్కారం, అవకాశం వుంది. హిప్నో థెరపీ ద్వారా మీ ఆత్మ విశ్వాసం పెంచి, మిమ్మల్ని మీరు కించపరుచుకోకుండా చేసి, మీ ధైర్యాన్ని పెంచగలిగితే, మీరు మామూలుగా మాట్లాడగలుగుతారు. మీకు తప్పకుండా పెళ్లి అవుతుంది. ప్రయత్నించి చూడండి.

? మనిషికి ముఖ్యంగా వుండే చెడు అలవాట్లు ఏమిటి? మనిషి జీవితంలో ముందుకు సాగాలంటే, జీవితంలో ఏమైనా సాధించాలంటే ఏం చేయాలి?

-ఎ.వి.మహేందర్‌రెడ్డి (విశాఖపట్టణం)

! మనిషికి ముఖ్యంగా రెండు చెడు అలవాట్లు వుంటాయి. మొదటిది బద్ధకమైతే, రెండవది ప్రతి పనిని వాయిదా వేసే అలవాటు వుండటం. ఈ రెండింటి నుండీ బయటపడాలంటే, మనిషికి ముఖ్యంగా ఆత్మవిశ్వాసం కావాలి. తాను చేసే తప్పులు, ఇతరులు చేసిన తప్పులు పాఠాలుగా నేర్చుకుని అవి మళ్లీ చేయకుండా వుండాలి. ఆత్మ విశ్వాసం కానీ, అనుభవం కానీ ఆలోచనల వల్ల రావు. జీవితంలో మనిషి ముందుకు సాగాలంటే ఇతరుల విమర్శను సాదరంగా తీసుకుని, చేసిన విమర్శలకు భయపడకుండా ముందుకు సాగాలి. జీవితంలో ఏదైనా సాధించాలంటే ముందుగా ఒక చక్కని లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలి. ఆ లక్ష్యాన్ని త్వరగా అధిగమించడానికి చొరవను చూపాలి. చక్కటి ప్లానింగ్‌తో ముందుకు సాగాలి. లక్ష్యాన్ని చేరే దారిలో రోజాపూలు తివాచీలాగా పరచి వుంటాయని అనుకోకుండా, ముళ్ల కొరకు ఎదురు చూడాలి. జీవిత లక్ష్యాన్ని చేరే ఆ దారిలో ముళ్లు గుచ్చుకున్నా, వాటిని తీసి పారేసి ముందుకు సాగాలి. ఇవన్నీ ఒక్క రోజులో జరిగేవి కావు. జీవితంలో పైకి రావాలంటే ఒక నిర్మాణాత్మకమైన కృషి చేయాలి.

? నేను ఒక ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాను. నా బాస్ నన్ను వలలో వేసుకున్నాడు. తత్ఫలితంగా నాకు ఒక బాబు పుట్టాడు. నాతో అవసరం తీరిపోయాక నా బాస్ నన్ను చులకనగా చూస్తున్నాడు. నేనిప్పుడు అదే ఆఫీసులోనే పనిచేస్తున్నాను. నేనిప్పుడు ఎలా బ్రతకాలి? నాకెవ్వరూ లేరు.

-ఆర్.వనజ (ఖమ్మం)

! మీ బాస్‌కు ముందుగానే పెళ్లి అయ్యిందనే విషయం మీకు తెలియదా? తెలిసి తెలిసి ఎందుకు తప్పు చేశారు? మీ తప్పు ద్వారా మీలాంటి ఇంకొక స్త్రీని (మీ బాస్ భార్యను) మోసం చేస్తున్నట్టుగా మీకు ఏ మాత్రం అనిపించలేదా! మీ బాస్ మేకవన్నె పులి అని తెలియగానే, ఆయన చేసిన మోసం మాత్రం మీకు పెద్దగా అనిపించిందా? అయినా, జరిగిందాన్ని తలుచుకుని ఇప్పుడు బాధపడి లాభం లేదు. ఇప్పుడు మీకు ఒక బాధ్యత వుంది. అది మీ అబ్బాయి భవిష్యత్తు. అది ఆయన బాధ్యత కూడా! ఒకవేళ ఆయన ఒప్పుకోకపోతే, రక్త పరీక్ష ద్వారా ఆ బాబు ఆయన బాబేనని ప్రూవ్ చేయవచ్చు. కోర్టుల ద్వారా భరణం పొందవచ్చు. ఏదిఏమైనా, ఆత్మ విశ్వాసంతో, ఆత్మ స్థైర్యంతో ముందుకు సాగండి.

? ప్రతి మనిషికి సమస్యలు వున్నాయా? ఉంటే అవి ఎవరు పరిష్కరిస్తారు?

-ఆర్.వనజ (బెంగుళూరు)

! సమస్యలు లేని మనిషి అంటూ ఎవరూ లేరు. ప్రతి మనిషికి కూడా కష్టాలు వుంటాయి. ఈ కష్టాలను, సమస్యలను పరిష్కరించుకుంటూ ముందుకు సాగిపోవాలి. ఎవరి సమస్యలను వారే పరిష్కరించుకోవాలి. "ఎవరో వస్తారని, ఏదో చేస్తారని, ఎదురుచూసి" అనే పాటను వినలేదా? మీ సమస్యలను ఎవరు పరిష్కరిస్తారనే మీ ప్రశ్న చాలా వింతగా వుంది. ఒకవేళ ఎవరైనా పరిష్కరిస్తానని వచ్చినా, మీ నుంచి ఏదో ఆశించే వస్తారని మరచిపోవద్దు. కారడివిలో వన్యప్రాణులు ఒక క్షణం ఆదమరిస్తే ప్రాణాపాయం తప్పదు. కాంక్రీటు అడవిలో వుండే రెండు కాళ్ల ప్రాణులు ఒక తప్పుడు ఆలోచన చేస్తే సమస్యలు తప్పవు.

? నేను ఒక గవర్నమెంటు ఆఫీసులో పనిచేస్తున్నాను. నాకు ఇతరులతో మాట్లాడాలంటే విపరీతమైన భయం. వాళ్ల కళ్లల్లో కళ్లు పెట్టి చూడలేను. ఆఫీసులో అందరూ నన్ను విపరీతమైన నిర్లక్ష్యం చేస్తారు. అందుకని నేను ఎప్పుడూ ఏకాంతం కోరుకుంటాను. దీనివల్ల డిప్రెషన్ బాగా పెరుగుతోంది. నేను కూడా అందరిలాగా వుండాలంటే ఏం చేయాలి?

-ఎమ్.రవూఫ్ (కడప)

! మీ తల్లిదండ్రులు బహుశా మిమ్మల్ని అతి స్ట్రిక్ట్‌గా పెంచి వుండాలి. అందుకనే, మీ ఆత్మ విశ్వాసం పెరుగలేదు. ఈ ప్రపంచం మనం భయపడినంతవరకూ మనల్ని తరుముతుంది. మనం ఆగి, ఒక్కసారి ఎదురు తిరిగితే అది తోక ముడుస్తుంది. మనం తప్పు చేయనంతవరకూ ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. వీలయితే, ఒకసారి అపాయింట్‌మెంట్ తీసుకుని కలవండి. సైకో థెరపీ, బిహేవియర్ థెరపీ ద్వారా మిమ్మల్ని పూర్తిగా మార్చడానికి ప్రయత్నిస్తాను.

? నా బిజినెస్‌లో ఈమధ్యనే నేను వుంజుకుంటున్నాను. కానీ, చాలా మంది చేసే విమర్శల వల్ల నేను తట్టుకోలేక పోతున్నాను. దీని ఎఫెక్ట్ నా బిజినెస్ మీద పడుతోంది. ఈ సమస్య నుంచి నేను బయటపడాలని అనుకుంటున్నాను. దయచేసి మంచి సలహా ఇచ్చి పుణ్యం కట్టుకోండి.

-ఎ.వి.రమణ (కర్నూలు)

! జీవితంలో పైకి రావడం వల్ల చాలా మంది కళ్లు ఎర్రబడతాయి. దీనివల్ల అసూయ పెరుగుతుంది. అసూయ మనిషిని విమర్శలు చేసేలా చేస్తుంది. కాని, ముందుగా మీరు గుర్తుంచుకోవలసిన విషయాలు కొన్ని వున్నాయి. ఎవరైనా విమర్శలు చేస్తే, మీ పనిని వాళ్లు గమనిస్తున్నారన్న మాట. మీరు తప్పులు చేయనంతవరకూ ఎవరినీ పట్టించుకోవలసిన అవసరం లేదు. కానీ, కొద్దిమంది మీరు తప్పులు చేసేలా చేస్తారు. వాళ్ల దగ్గర జాగ్రత్తగా వుండండి. వాళ్లు చేసే విమర్శలను మీరు సద్వినియోగం చేసుకుని, జీవితంలో ముందుకు సాగండి. ఒకవేళ వాళ్లు పనిగట్టుకుని విమర్శలు చేస్తే, అసలు మీరు వాళ్లని పట్టించుకోవద్దు. మీ బిజినెస్ మీరు మంచిగా చేసుకుని జీవితంలో ఇంకా పైకి వచ్చి, వాళ్ల కళ్లను ఇంకా ఎర్రగా చేయడమే మంచిది.

**-డా. వి. నగేష్**

మీ ప్రశ్నలు పంపాల్సినచిరునామా

మనసువైద్యం

ఆదివారం ఆంధ్రజ్యోతి, రోడ్ నెం: 8,
బంజారాహిల్స్, హైదరాబాద్-500 034

---

## వెలుగు ఎక్కడ సోనియా కథ

12వ పేజీ తరువాయి

కుర్రాడు. ఎట్లా గెలిపించుకుంటారో మీ యిష్టం!" అంటూ రెచ్చగొట్టేడు. గెలుపు ఖాయమేననే నమ్మకం కలిగింది.

ఆ రాత్రి నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రకాశరావుతో హైదరాబాదు వరకు వెళ్ళేను, ఆయన్ను వదిలిపెట్టేరాను. ప్రకాశరావు అలిసిపోయి పడుకున్నాడు. రెండు పెగ్గుల స్కాచ్ యిచ్చి పక్కనే కూర్చున్నాను. మెత్తగా, మృదువుగా ఆయన కాళ్ళు నత్తుతున్నాను. ప్రకాశరావు వద్దని వారిస్తాడేగానీ, ఆయనకిట్లా కాళ్లు నత్తించుకోవటం యిష్టం. హఠాత్తుగా కళ్ళ ముందో వెలుగు. పక్క సీటులో సోనీ. క్షణంపాటు అనూహ్యమైన ఉద్వేగం. సోనీ ముఖంలో అదే ప్రసన్నత. అపారమైన కరుణ, ప్రేమ. పెదవులపై మృదువైన చిరునవ్వు. ప్రశ్నార్థకంగా నా వైపు చూసింది. సిగ్గుగా, బరువుగా అనిపించింది ఆ సన్నివేశం. సోనీ మౌనంగా కూర్చుంది. నా వంటిపైని ఖద్దరు బట్టలు, ఖరీదైన సెంటువాసన, జేబులోని రేబాన్ కళ్ళజోడు, బరువుగా, అనీజీగా అనిపించాయి. "పేపర్లలో చదివాను" పేరు విప్పింది. తన గురించి చెప్పింది. ఎమ్మే పూర్తిచేసి గుంటూరులోనే వాలంటరీ ఆర్గనైజేషన్‌లో పనిచేస్తున్నట్లుగా చెప్పింది. కలుసుకోమని అడ్రసు ఇచ్చింది. ఈ అద్భుతమైన స్త్రీ, ఈ సోనీ, నా భార్య అనే ఊహ పదవిని మించిన ఆనందాన్ని యిచ్చింది. సోనీ మెడలో మంగళసూత్రం, ఉంగరం. నా గతాన్ని పది లపరిచి మళ్ళీ నాకు అందించడానికి సిద్ధంగా వున్న గృహ దేవత. "నాన్నతో ఒకసారి మాట్లాడతాను" అన్నాను. మౌనంగా వుంది సోనీ.

రెండు లక్షలు అనుకొన్న ఖర్చు పది లక్షలకు పైగానే దాటింది. పాతిక జీపులు, వందకు పైగా ఫుల్ టైము వర్కర్లు, వాల్ పోస్టర్లు, గోడలపై నినాదాలు, ప్రత్యేకంగా రికార్డు చేసిన క్యాసెట్లతో, మైకులతో వీధులన్నీ నినాదాల జల్లులైనాయి. కుల పెద్దల్ని పిలవటం, అందరికీ పంచమని తలా పాతిక వేలు ఇవ్వటం - రోజులు గడిచేకొద్దీ అర్థంకాని టెన్షన్. రోజు పొడవునా విస్కీ తాగాలనిపించే కోరిక. గెలుపును గురించిన ఈ భయం శరీరంలో ఒక రహస్యపు జ్వాలలా కనబడకుండా పాకుతున్నట్లుగా అనిపించేది. రిగ్గింగు ఏర్పాట్లకని రౌడీ షీటర్లను ఏర్పాటుచెయ్యటం, అనుకూలమైన పోలీసు ఆఫీసర్లను, రెవిన్యూ ఆఫీసర్లను ఇంటి దగ్గర కలిసి చేతులు తడపటం - చీదర చీదరగా వుందీ వ్యవహారమంతా. కార్యకర్తల కోసమని రెండు అపార్టుమెంట్లు రెంటుకు తీసుకున్నాను. రాత్రుళ్ళు వాళ్ళు బిరియానీ, మందు లాగించి, ఆ పేటలో అయిదు వందల ఓట్లూ మనవే, ఈ పేటంతా మన పిడికిలిలోనే వుంది అంటూ అరుస్తూ వుంటే, ఎందుకో ఆ మాటలు ఏంత సుఖాన్ని ఇచ్చేవి. క్రమంగా నేనో సైకిక్‌నైపోయానేమోనని భయం వేసేది.

ఎలక్షన్ ఇంకా నాలుగు రోజులుందనగా శేషు అనే కార్యకర్త ఒక బాంబులాంటి వార్త తెచ్చాడు. ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన కార్యకర్తలు ఆనంద పేటలో తాగిన మత్తులో ఇళ్ళపైబడి ఆడవాళ్ళను గోలచేసేరని. ఒట్టి గోలే కాదని, ఒక గుడిసెలో చొరబడి, మొగుణ్ణి చితగ్గొట్టి, ఆడమనిషిని చెరిచారని - ఆ గుడిసెపై ప్రతిపక్షం వాళ్ళ జెండా వుందని సాకు చెప్పారట. గుండెలో నిజంగా బాంబు పేలినట్లనిపించింది. అప్పటి కప్పుడు ఎస్.పి.ని కలిసి, పోలీసులవైపు నుండి ఏ గొడవ రాకుండా చూసుకోవటం, పత్రికా ఆఫీసుకు వెళ్ళి న్యూస్ ఎడిటర్స్‌ని మేనేజ్ చెయ్యటం - రాత్రంతా టెన్షన్‌గా గడిచిపోయింది. ఆ కుటుంబాన్ని సముదాయించమని, పది వేల ధన సహాయం ఇవ్వమని కుల పెద్దలను ఒప్పించటం - లేని పోని తంటా మెడకు చుట్టుకున్నట్లయింది.

అంతా సర్దుకుపోయింది అనుకుంటుండగా, ఉదయం ఎనిమిది గంటలకు టౌన్ బందుకు పిలుపునిచ్చారని వార్త వచ్చింది. ఆ పేటలో 'యంగ్ ఇండియా' అనే వాలంటరీ ఆర్గనైజేషన్



వుంది. అందులో పది మంది దాకా కుర్రాళ్ళు వున్నారు. వాళ్ళు ఊరంతా తిరిగి గొడవ చేస్తున్నారట. 'హింసాత్మక రాజకీయాల్ని ఖండించాలని' వాళ్ళ నినాదం. 'రౌడీ షీటర్లు నాయకులవకుండా ఎలక్షన్లను బహిష్కరించాలని' వాళ్ళ ప్రచారం. బందు టైములో కార్యకర్తల్ని బయటకు పంపవద్దని ఎస్.పి. ఆర్డర్ వేశాడు. ఊహించని విధంగా బంద్ నంద శాతం సక్సెస్ అయింది. ప్రకాశరావు ఫోన్ చేసి ఫైర్ చేశాడు. 'కార్యకర్తలపై అదుపులేనివాడివి నువ్వేం నాయకుడివి' అని తిట్టాడు.

ఎన్నికలు ఇంకా మూడు రోజులే. ఆనందపేట, ఆ చుట్టూ పేదల కాలనీలు ఎన్నికల్ని బాయ్‌కాట్ చేస్తున్నట్లుగా వార్త వచ్చింది. కార్యకర్తల్ని ఎవర్నీ రానివ్వటం లేదు పేటల్లోకి. అంతా ఒక కట్టుగా వున్నారు. పది వేలకు పైగా ఓట్లు. కుల పెద్దలు, డాక్టర్లు, లాయర్లు ఎవరి ద్వారా ప్రయత్నించినా వినడంలేదు. నిస్సహాయత! భయం! పిరికిగా, దుఃఖంగా లోపల కూర్చుని ఏడవాలనిపించే మానసిక స్థితి. వందల విస్కీ పెగ్గులు ఆపలేని భయం వరద.

ఒక తెగింపు. ఒక కిరాతకమైన వాంఛ నాలో రేగింది. చీకటి బాగా ముసిరిన తరువాత పాతిక మంది రౌడీల్ని పిలిచి, 'యంగ్ ఇండియా' బిల్డింగ్‌పై దాడి చెయ్యమని చెప్పాను. అందులోని కుర్రవాళ్ళని ఏరి ఏరి వేటాడమని చెప్పాను. అప్పటికి రాత్రి రెండు దాటింది. వెలుతురంతా మాయమై దట్టమైన చీకటి కమ్ముకుంటుండగా సమయంలో ఎక్కడో తీతువు భయంకరంగా అరుస్తోంది.

xxx

బాంబు పేలిన తరువాత ఎదురయ్యే దృశ్యంలా మూగగా, పెను రోదనగా వుందా ఉదయం. గదులన్నీ ఖాళీగా వున్నాయి. అనుచరులెక్కడ? జైజైలెక్కడ? పంచరంగుల చిత్రాలు, గంభీరమైన ఉపన్యాసాలు, ఏవీ ఎక్కడ? బంగళాని భయం పహరా కాస్తున్నట్లుగా వుంది. ఒక అవాంఛితం కోసం ఎదురుచూస్తున్నట్లుగా వున్నాయి పరిసరాలు. హాలు పొడవునా పరిచిన జెండాలు, కొత్తగా కుట్టించినవి - వాటిని చూస్తుంటే పాముల గుట్టలను చూసినట్లుగా ఉలికిపాటు. జెండా గురించిన నా అజ్ఞాత భయాలు వెలికివచ్చి, భుజంపై వాలి గీగీమంటున్నాయి.

"నలుగురు పొయ్యారు! వాళ్ళలో ఒక ఆడపిల్ల కూడా వుంది. ఊరంతా కోపంతో ఉడికిపోతున్నారు. ఊరేగింపు ఒకటి ఇటువైపే వస్తుంది. మీరిక్కడ వుండడం మంచిది కాదు!" అనుచరుడొకడు పన్నెండు గంటల వేళ చెవిలో ఊదాడు.

బయట రోడ్డుపై కలకలం. వందలాదిగా, వేలాదిగా జనం ఊరేగింపుగా వస్తున్నారు. అల్లప్పుడెప్పుడో సోనీతో కలిసి చూసిన స్పార్టకస్ సినిమా గుర్తుకొచ్చింది. అందులోలాగే వుందీ దృశ్యం. మనుషుల సముద్రంలా వున్నారు వాళ్ళు. వాళ్ళంతా మౌనంగా నడుస్తున్నారు. ఘోషించటం లేదు. 'డౌన్ డౌన్' అని అరవటం లేదు. నోళ్ళ చుట్టూ నల్ల రిబ్బనులు కట్టుకున్నారు. గుంపు ముందో లారీ. లారీపై పేర్చిన శవాలు. వెనుక జనం. ఊరేగింపు బంగళాని సమీపించింది. క్షణం సేపు ఊరేగింపు ఆగింది. బహుశా రాళ్ళు విసిరి, లేదా బంగళాను తగలబెట్టి, ఏదో జరగాలి! మోహన సుందరం శిక్షింపబడాలి!

"మీరు రండి సార్! పరిస్థితి బాగాలేదు!" అనుచరుడొకడు వెనుక్కు లాగుతున్నాడు. ఎక్కడి నుంచో ఒక రాయి వచ్చి భళ్ళున అద్దం పగిలింది. అప్పటికి బంగళా నుంచి బయటకు వచ్చేశాను, వెనక తలుపు నుండి. నా వెనుక బంగళా కూలుతున్న శబ్దం.

xxx

మారుమూల అపార్టుమెంటు. రహస్యం. ఒంటరితనం. లోపలి భాగాలు నిప్పు అంటుకొని దగ్ధమౌతున్నట్లుగా, లోపలంతా ఒక ఆక్రందన. మెదడులో ఎంతకీ ముగియని శవయాత్ర.

ఒడ్డు తెలియని నావలా ఆ గదిలో అటు ఇటూ తిరుగుతూ - ఒక పలకరింపు కావాలి! కనీసం మనుషుల్ని చూడాలి! వినాలి! లేకుంటే నేను శవంలా కుళ్ళిపోతాను.

సోనీని పిలవాలి! సహచరి హోదాలో. వస్తుందా? ఇన్నేళ్ళ తరువాత, ఇట్లాంటి సంఘటన తరువాత. ఎన్నేళ్ళుగా ఈ స్త్రీ కోసం ఎదురుచూస్తున్నానని, ఆమెకు చెప్పగలగాలి!

నా కథలో ఇదొక మలుపు!

అపార్టుమెంటు 104లో ఒక చలనం. మంద్రగీతంలా సోనీ అడుగులు. పరిచయమైన అడుగులు. ఆ చూపులు-ఆ స్పర్శ, ఆ మనిషి-గుండెల్ని చీల్చుకువస్తున్న స్వప్నంలా.

"నాకో మోహన సుందరం తెలుసు! అతనిప్పుడు లేడు. చనిపోయాడు. అతని జ్ఞాపకాల ముద్రలు ఇంకా నాలో చెరిగిపోలేదు. చనిపోయిన భర్త జ్ఞాపకాల్లో బ్రతుకుతున్న విడోను.

"నిన్ను గురించి ఒక సోషల్ ఏనిమల్‌గానే నాకు తెలుసు. వేదాట తగిన రాజకీయ జంతువ్వు నీవు. నీపై కసి, ద్వేషము తప్ప మరే అనుభూతులూ లేవు నాకు!"

సోనీ వెళ్ళిపోతుంది. ■

వచ్చేవారం కథ

**పాడుబావి**

-రాణీ శివశంకర్





104